
## 13




గడుసుదనమున్న కథల్ని గడుసువాళ్ళే బాగా రాయగలరని నా నమ్మకం. జీవితంలో ఏ మాత్రం గడుసుతనం చూపించలేని వాళ్ళు కథల్లో మాత్రం గడసరితనం ఎక్కడనుంచి తేగలరు? అందుకే ఆదూరి అటువంటి కథల్ని రాయలేదు!

తాను నమ్మిన మంచితనాన్ని, తాను గౌరవించే మానసత్వపు విలువల్ని తాను అభిమానించే ఆర్ద్రతనూ అందంగా సృజిస్తూ; మంచిగా, మహోన్నతంగా, జాలిజాలిగా హాయి హాయిగా రాయటం మాబాగా చేతనవును ఇతనికి.

అందుకే 'ఆశల దివ్వెలు' అందమైన కథగా తయారయింది. మామూలు మధ్యతరగతి ఇళ్ళలోని అమ్మకు ప్రతీక శారదమ్మ. ప్రేమానుబంధాల చిరుజల్లు ఈ కథముగింపు.... ముందుకు వెళితే మీకే తెలుస్తుంది....

—ద్విభాష్యం రాజేశ్వరరావు.

సంధ్య వెలుగు పోయి చీకట్లు ముసురుకుంటున్న వేళ. ఆకాశం నిండా తరకలు తరకలుగా మేఘాలు పేరుకుంటున్నాయి. గాలి జోరుగా వీస్తూంది. చినుకులు కూడా చిన్నగా మొదలయ్యాయి.

కళ్ళు మూసుకుని పడుకున్న శారదమ్మ తన అంతర్నేత్రంతో జీవితంలో గడిచిన ఎన్నెన్ని సంఘటనలనో మౌనంగా దర్శిస్తూంది. ఆమె మనో ఆకాశం నిండా ఆలోచనా మేఘాల దొంతరలు చిక్కగా అలుము తున్నాయి. అలసిన గుండె బరువెక్కింది. ఏ క్షణాన్నయినా కన్నీటి చినుకులు రాలచ్చు అన్నట్లుందామె స్థితి.

'ఒంటరితనం ఎంత భయంకరమైనది? కొడుకు, కోడలు, ఇద్దరు కూతుళ్ళు, అల్లుళ్ళు, మనుమలు. ఇందరున్నా తనిప్పుడు ఒంటరిపక్షి. స్త్రీకి బాల్యంలో తండ్రి, యౌవనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు అండగా నిలుస్తారట. అన్ని అవస్థలూ తనకు సజావుగానే జరిగాయి. కానీ, ఈ జీవితపు చరమాంకంలోనే ఈ పరిస్థితి.

భర్తను ఒక దేవుడుగా కొలిచినందుకూ, ఆయన అనురాగపు వెల్లువలో పునీతమైనందుకూ చివరి క్షణంవరకూ ఆర్థికంగా తను ఒకరిపై ఆధారపడ నవసరంలేని జీవితాన్నే ప్రసాదించేరాయన.

సంపాదన తక్కువయినా లేనిపోని ఆడంబరాలకూ, బేషజాలకూ పోకుండా పిల్లలకోసం ప్రతినెల సంపాదనలో కొంత మొత్తాన్ని పొదుపు చేసేవారు. 'పిల్లల భవిష్యత్తు కోసం తల్లితండ్రులు కొన్ని సౌఖ్యాల్ని త్యాగం చేయక తప్పదు!' అనేవారు.

అలా ఆయన ముందుచూపుతో వ్యవహరించి ఉండకపోతే ఈ పిల్లల ముగ్గురి జీవితాలూ ఇలా ఆనందమయంగా ఉండేవా? తనకు మాత్రం ఉండడానికి, జీవితం వెళ్ళమార్చుకోవడానికి ఓ ఇల్లంటూ జత

పడేదా? ఒక విధంగా చూస్తే యీ అదృష్టమంతా ఆయన సమకూర్చినదే. పోతే, విధిరాసిన రాత నెవరు తప్పించగలరు?"

బయట వర్షం హెచ్చింది. తాటాకు కమ్మలమీద పడే వర్షం వింత శబ్దాన్ని చేస్తూంది. ఎక్కడో ఓ ఉరుము ఉరిమింది. నెమ్మదిగా కనుగుడ్లు కదిలించి, రెప్పలు విప్పి గది కిటికీలోనుంచి బయటకు చూపు సారించింది శారదమ్మ.

బయటి వెలుగుకు చూరునుండి కారే నీటిధారలు వెండి దారాల్లా కనిపిస్తున్నాయి. ఏ విషయాన్నైనా అనుకుని తృప్తిపడంలోనే ఉంది' అనిపించింది. 'ఈ రోజు తను పడే ఈ బాధ, మనఃక్లేశం ఇన్నాళ్ళూ ఎందుకు లేవో అర్థంకాదు. ఒంటరితనం ఇంతటి ఘోర శాపమని తని న్నాళ్ళూ అనుకోలేదు. ఒంటరితనంలోనే తృప్తినీ, జీవిత పరమార్థాన్నీ వెదుక్కుంది. బాధ్యతలు నెరవేర్చి, బరువులు దించుకున్న ఈ జీవితపు చరమాంకంలో ఈ ఒంటరితనం ఒక రకంగా చూస్తే శాంతిపర్వమే. కానీ, బాధ్యతలు తీరినా మమతలు మాసిపోవు. అభిమానాలూ, ఆప్యాయతలూ అంతరించిపోవు అందుకే మనసులో ఈ కొట్టుకులాట

తెల్లారితే పండగ, ఊరంతా సందడిగా ఉంది. ఒక రకంగా ఈ పండగంటేనే తన కిష్టం. మిగిలిన పండగల్లో లేని ఆనంద మేదో ఈ పండగలోనే కనిపిస్తుంది తనకు.

'ఏమిటో ఆ ఆనందం ఆయనతోనే పోయింది' నిట్టూర్చింది శారదమ్మ. ఆమె కనుకొలకుల్లోకి నెమ్మదిగా నీరు చేరడం మొదలు పెట్టింది. నాలుగైదు రోజుల్నుంచి రోజూ ఆశగా ఎదురు చూస్తూంది కొడుకు దగ్గిర్నించి ఏదైనా ఉత్తరం వస్తుందేమో అని. 'ఈ సాయంత్రం కూడా పోస్టుమన్ తనను చూసి ఏం లేవన్నట్టు చెయ్యి తిప్పి వెళ్ళిపోయాడు. అయినా, తన పిచ్చిగాని తనకుండే ఆత్రత, బాధ వాడి కెందుకుంటుంది?

తన సంసారం, తన భార్య, తన పిల్లలు, వాళ్ళ ఆనందం. అంతే! కాలం మారిపోతోంది. కాలంతోపాటు అభిమానాలూ తగ్గిపోతున్నాయా.'

శారదమ్మ మంచంమీద అటునుంచి ఇటు ఒత్తిగిలి పడుకుంది. అంతలోనే బయటినించి ఎవరో పిలుస్తున్నట్టయి లేచి తలుపు తీసింది. ఎదురింటి వర్ధనమ్మగారు!

"ఇంట్లో దీపాల్లేకపోవడం చూసి మీరు లేరనుకున్నాను. ఈ రోజు గీతాపారాయణ లేదా" అడిగిం దావిడ.

"ఒంట్లో కాస్త నలతగా ఉంటేనూ...." అంటూ నీరసంగా ఓ నవ్వు నవ్వింది శారదమ్మ.

"వంటకూడా చేసుకున్నట్లు లేదు. పోనీ, కాస్త రొట్టె అయినా తినండి" అంటూ ఆ కబురూ, ఈ కబురూ చెప్పి వెళ్ళి, కాస్సేపటికి మినపరొట్టె పట్టుకుని వచ్చింది.

'వీళ్ళందరికీ ఎందుకో తనంటే అభిమానం! ఏం చేసిందని తను?

'మనం మంచిగా ఉంటే లోకం మనపట్ల మంచిగా ఉంటుందం టారు. అది నిజమనిపిస్తోంది.'

"మీ దిగులంతా మీ అబ్బాయినుండి ఉత్తరాలు రాలేదనేగా! ఏమో.... ఈ పండక్కి రావచ్చుగా" అందావిడ.

"తన కా నమ్మకంలేదు. పండుగలూపబ్బాలూ చేసుకుందుకి ఏముం దిక్కడ? ఈ రోజుల్లో. ఇల్లు కదలాలంటే మాటలా? ఆ ఖర్చు చేసే డబ్బుతో ఎక్కడ చేసుకున్నా పండగ వెళ్ళిపోతుంది."

వీధి తలుపువేసి వచ్చి మళ్ళీ మంచంమీదమేను వాల్చింది. బయట చినుకులు చిన్నగా రాలుతూనే ఉన్నాయి. కళ్ళు మూసుకున్నా ఆలోచనలు చుట్టుముడుతూనే ఉన్నాయి. "ఎప్పుడూ లేనిది తను చక్రధరం నుండి ఉత్తరం కోసం ఎదురుచూడ్డం, పండక్కి రమ్మని రాస్తాడని ఆశపడ్డం

విచిత్రంగా తోస్తూంది. ఎన్నిమార్లు వాడు తనని రమ్మని బతిమాలలేదు? తనే వెళ్ళలేదు. తన ఆచారాలూ, చాదస్తాలూ ఈ కాలం వాళ్ళకి నచ్చవు. పైగా మరో మనిషి భారం. కానీ, ఈ మారెందుకో వాడు రాస్తే తుర్రున రెక్కలు కట్టుకుని వెళ్ళాలనిపిస్తోంది.

శారదమ్మ ఆలోచనలు నెమ్మదిగా గతంలోకి పరుగులు తీశాయి. ఇద్దరాడపిల్లల మధ్య ఒక్కగా నొక్క మగపిల్లాడు చక్రధరం. ఆ ముగ్గుర్నీ పిల్లల్లా కాకుండా తన ఆశల రూపాల్లా అపురూపంగా పెంచు కొచ్చింది.

మాలతిని ఇంగ్లిషు లెక్చరర్ని చెయ్యాలని ఆశపడ్డా రాయన. అయితే. బి.ఎ.లో క్లాసొచ్చినా చదువుమాత్రం సాగలేదు దానికి. అదే సమయంలో అనుకోకుండా వచ్చిన పెళ్ళిసంబంధం కుదిరిపోయింది. పిల్లను చూసి కట్నం తీసుకోకుండానే చేసుకుంటామన్నారు. ఎంత చదివినా ఆడపిల్లకు పెళ్ళి సమస్యే. ఆ సమస్య ఇంత సులువుగా పరిష్కారమవుతుంటే ఎవరు మాత్రం కాదనగలరు?

పిల్లలు పుట్టినప్పుడే వారి భవిష్యత్తుకోసం నెలకింతని పోస్టాఫీసులో దాచడం మొదలు పెట్టారాయన.

చక్రధరాన్ని ఒ.ఎ.ఎస్. ఆఫీసర్ని చేయాలన్న ఆయన ఆశయం కూడా నెరవేరలేదు. అన్నిటా ఫస్టు మార్కులు తెచ్చుకున్న చక్రధరం లెక్కలమీద ఉండే అభిరుచిలో ఇంజినీరయ్యాడు.

చక్రధరం చదువు గురించి ఎన్ని ఆశలు. ఎంత తాపత్రాయం? వాడికి అయిదో ఏడు వచ్చిన నాటినుంచే వాడి చదువుకోసం కొంత మొత్తాన్ని దాచటం మొదలుపెట్టారు. సరిగ్గా కాలేజీకి వచ్చే సరికి అందు కొచ్చిందది. కానీ, అప్పటికే చక్రధరానికి ప్రభుత్వం ఇచ్చే మెరిట్ స్కాలర్‌షిప్ వచ్చింది.

"పిల్లల నుదుట అదృష్టగీత ఉంది. అదే వారి జీవితాన్ని చూపు దిద్దుతుంది" అనుకున్నారు తాము.

అందుచేతే వసంత గురించి ఏ ఆశలూ పెట్టుకోలేదు.

చక్రధరం పెళ్ళికి వసంత ఇంకా ఓణీలు వేసుకోలేదు. చక్రధరానికి కట్నం తీసుకోకూడదనే అభిప్రాయాని కొచ్చేరాయన. ఆశయాలనేవి అమలు జరిపితేనే అందం.

"నా కొడుకుని ప్రయోజకుడిని చేయాలనే ఉద్దేశంతోనే చదివించాను. ఆ ఖర్చంతా ఆడపిల్ల తండ్రి దగ్గర దాబట్టాలనుకోవడం దురాశే అవుతుంది. అదే జరిగితే తండ్రీ కొడుకుల మధ్య బంధమేముంటుంది? బాధ్యత లేముంటాయి? అనేవారాయన.

చక్రధరానికి మాత్రంఉండేది. "ఇంత చదువుచదివి ఈస్థితికికొచ్చాక ఇచ్చేవారుంటే పుచ్చుకుందుకేం? పైగా నాన్నగారి ఒంటి సంపాదనమీద ఇన్నాళ్ళూ గడుపుకొచ్చాం. ఆయన సంపాదనలో పొదుపు చేసినదానిలోనే శుభకార్యాలూ, చదువులూ అయ్యాయి. ఎల్లకాలం అలాగే ఉండి పోవాలని ఏం ఉంది" అనేవాడు తనతో కాని, తండ్రి మాట కెదురు చెప్పలేక పోయేవాడు.

కట్నం తీసుకోమనేసరికి చక్రధరం మామగారు మొదట ఆశ్చర్యపోయారట. ఆ తరవాత కుర్రాడిలో ఏమైనా లోపాలున్నా యేమోనని వాకబు చేసారట. ఆయనకి బోలెడు ఆస్తిఉంది. ఒక్కగానొక్క కూతురు అందుచేత ఇంజినీర్నిగాని, డాక్టర్నిగాని అల్లుడుగా చేసుకోవాలని ఆశ.

సుందరి తమ ఇంటి కోడలుగా కాలు పెట్టిన దగ్గరినుంచి ఇంటి పరిస్థితుల్లో కాస్త మార్పు వచ్చింది. ఉన్న మూడు గదుల ఇల్లూ చాలని పరిస్థితి ఏర్పడింది. లంకంత ఇంట్లో మసలి వచ్చిందేమో సుందరి, ఆ ఇరుకు వాతావరణంలో ఇమడలేకపోయేది.

ఒకే ఊళ్ళో వేరింటి కాపురం అనే మాట రాకుండానే పరిస్థితులు చక్కబడ్డాయి. చక్రధరానికి కలకత్తా బదిలీ అయిపోయింది. సుందరి ఆనందానికి అవధుల్లేవు.

"ఉద్యోగస్థుడికి ఒక ఊరంటూ ఏముంది? వెళ్ళనీ" అన్నారాయన తను బాధ పడ్డం చూసి. వెళ్ళి అప్పుడే ఆరేళ్ళయి పోయింది.

నిట్టూర్చి లేచింది శారదమ్మ. అర్థరాత్రయినట్టుంది. బయటా అంతా నిశ్శబ్దం. వర్షం కూడా తగ్గిపోయింది. కూజాలోని నీళ్ళు కాసిన్ని తాగి మళ్ళీ మంచంమీద వాలిపోయింది.

ఆలోచనల మధ్య ఎప్పుడు పట్టిందో నిద్ర లేచేసరికి తూర్పు ఆకాశం తెల్లబడిపోయింది. త్వరత్వరగా కాలకృత్యాలు ముగించుకుని వచ్చేసరికి వీధిలోంచి పాలవాడు కేకవేశాడు.

"పండగ కదా ఎక్కువ పొయ్యమంటా రేంటమ్మా?"అడిగాడు వాడు. తనొక్క దానికీ పండగేమిటీ? ఏం చేసుకోవాలి? చక్రధరం రమ్మనిరాస్తే ఈపాటికి వెళ్ళిపోయేది.

"ఉంటే పొయ్య" అంది అప్రయత్నంగానే. వాడు ఎప్పటినుండో తమకు పాలుపోస్తున్నాడు. తమ ఇంట జరిగిన శుభం. అశుభం అన్నీ తెలుసు వాడికి.

పాలగిన్నెను కుంపటిమీద పెట్టి పూజకోసం పూలుకోద్దామని వీధిలోకి వచ్చింది శారదమ్మ. పారిజాతం, నందివర్ధనం, గులాబి, మందారం విరబూసి ఉన్నాయి. పువ్వుల్ని చూసినప్పుడల్లా పసిపిల్లలు గుర్తుకొస్తారామెకు అప్పుడు శారదమ్మ కళ్ళలో మనుమడు, మనుమరాలు మెదలుతారు.

"ఇప్పుడేం చేస్తూ ఉంటారో ఆ చిన్న వెధవలు? వాళ్ళకీ మామ్మ ఎప్పుడైనా గుర్తుకొస్తుందో, లేదో, అనుకుంది.

అప్పుడే రెండు కాకులు చూరుమీదవాలి "కావ్, కావ్"అని గోల చేశాయి.

పూజ ముగించుకుని, కాసింత కాఫీ కలుపుకుని తాగి, గది చక్క-బెట్టుకుంటూంటే వీధిలోంచి కేక వినిపించింది. "ఎవరా"అని వీధిలో కొచ్చిన శారదమ్మ ఆశ్చర్యంగా ఉండిపోయింది. ఆ వచ్చింది పార్వతి. ఆకుపచ్చమీద పసుపు పూవులున్న చీర, ఆకాశనీలం జాకెట్టు. చేతులకు ఎర్రగాజులు. కాళ్ళకి పట్టాలు నుదుట పావలా కానంత బొట్టు-అచ్చం వనలక్ష్మిలా ఉంది. దాని వెనకే కాస్తంత దూరంలో దాని భర్త!

"నువ్వాటే! రా-రా, ఎన్నాళ్ళ కొచ్చావ్"అంది శారదమ్మ.

పార్వతి అరుగుమీదే కూర్చుంది.

"ఊళ్ళోకి నిన్ననే వచ్చేనమ్మగారూ. వచ్చిందగ్గరినుంచీ మిమ్మల్ని చూడాలనే ధ్యాస"అంది.

"పోనిలేవే-నీకైనా ఉందా అభిమానం"అంది శారదమ్మ అప్రయత్నంగా.

పార్వతి తనింట్లో ఒకప్పుడు పనిమనిషిగా చేరినా ఇంట్లో మనిషిగానే ఉండి అన్ని పనులూచేసి పెట్టేది. పార్వతిపదేళ్ళ పిల్లప్పుడు తనింటి కొచ్చింది.

'తల్లిలేని పిల్లను మీచేతుల్లో పెడుతున్నాను. ఇకమీద అన్నీమీరే' అన్నాడు దాని తండ్రి తనకప్పగిస్తూ. తల్లి లేకపోవడమంటే ఏమిటో ఆ వెలితి ఎటువంటిదో తనకు బాగానే తెలుసు. అందుకే తను దాన్నిదగ్గరకు తీసింది. జీతానికి పనిచేసే పిల్లలా కాకుండా సొంత పిల్లలా చూసుకునేది. పార్వతికూడా అణకువగా, విశ్వాసపాత్రంగా పనిచేసేది. వారానికో మారు వెళ్ళి తండ్రిని చూసొచ్చేది

పార్వతి తమ ఇంట్లో ఉండగానే పెద్దదయి ఓణీలు వెయ్యడం మొదలు పెట్టింది. 'ఎంత అర్జనపరులైనా నీ కూతుర్ని ఎప్పుడో

అప్పుడు ఒక అయ్య చేతిలో పెట్టక తప్పదు. నువ్వేలాగూ ఖర్చులు భరించలేవు. దాని సంపాదనలోనె నా కొంత మిగల్చక తప్పదు।" అని ప్రతి నెలా దానికిచ్చే జీతంలోనే కొంత పోస్టాఫీసు సేవింగ్స్‌లో వేయించారాయన. దాని పెళ్ళి సమయానికి అది అంది వచ్చింది.

ఆ కృతజ్ఞతాభావం పార్వతిలో అణువణువునా, కనిపిస్తుంది 'బాబుగారలా దాచకపోతే నా పెళ్ళయ్యేది కాదేమో' అన్నదొకమారు పార్వతి భర్తకూడా మంచివాడే. కాయకష్టం చేస్తాడు. భార్యని పనిలోకి పంపకుండానే పోషిస్తున్నాడు.

లోపలికెళ్ళి టీ కలిపి రెండు గ్లాసుల్లో తెచ్చి వారిద్దరికి ఇచ్చింది.

"ఇదేంటం దమ్మగారూ! మావేం బందువులిమా, స్నేహతులిమా? మా కెందుకివన్నీ" అంది పార్వతి.

"ఫరవాలేదులేవే. పండగపూట మా ఇంటికొచ్చిన అతిథులు మీరే. ఇంతకంటే ఎక్కువగా పూర్వంలా నే నిచ్చేదీలేదు. మీరు పుచ్చుకునేవీ లేదు."

ఈ మాట లంటున్నప్పుడు శారదమ్మ కళ్ళలో నీటిపొర అడ్డు నిలిచింది.

ఎలా ఉండే ఇల్లు? ఏ పండగొచ్చినా కలకల్లాడి పోయేది బాబు గోరూ, మాలతమ్మా, చినబాబుగోరూ, వసంత అంతా బిలబిలా తిరుగుతా ఉంటే. దేవుడి గదిలో మాలక్ష్మిలా మీరు...." ఆపైన మాట్లాడలేక పోయింది పార్వతి. కాస్సేపటికి తమాయించుకుని" ఎలా ఉన్నా ఇది మాశారదమ్మగారిల్లే. ఇది సీతమ్మవారి పర్ణశాలలా ఉండాల్సిందే" అంటూ వాకిలంతా శుభ్రం చేసింది. పార్వతి భర్తకూడా పారతో కలుపు మొక్కల్ని కొట్టేసి పెరడంతా శుభ్రంగాచేసేడు. ఓ గంటలో ఆ ఇల్లు పర్ణశాలలానే తయారయింది.

పార్వతి వెళ్ళాక లేచి, కాసిన్ని బియ్యం కడిగి కుంపటికి దపెట్టి వచ్చి గుమ్మానికి జారగిలబడి కూర్చుంది.

నిజమే-పండగంటే ఒకప్పుడెంత వైభోగమానంగా ఉండేదీ! ఆయన మరో నాలుగు నెలల్లో పోతారనగా వచ్చిన పండగకూడా బాగానే జరిగింది. నాలుగు రోజులు ముందుగానే మాలతి, భర్త వచ్చారు. చక్రధరం, సుందరికూడా ముందు రోజువచ్చారు. ఇల్లంతా ఆనందంతో నిండి పోయింది.

"శారదా! స్వర్గమంటే ఎక్కడోలేదు. మన హృదయాలలో పొంగే ఈ ఆనందం, మనస్సుల్లో కలిగే ఈ సంతోషం, ఈ అభిమానం ఇదే స్వర్గమంటే...." అన్నా రాయన ఆ రాత్రి నిద్రపోతూ.

అంతే! అదీ తను చేసుకున్న ఆఖరి పండగ.

ఆయన పోవడంతో తను మానసికంగా ఒంటరిదైంది. ఇంటింటికీ తనూ, వసంతే! వసంత ఇంటర్ రెండో సంవత్సరంలో ఉందప్పుడు. చదువు పూర్తయితే, ఏడాదిలోపు దాని పెళ్ళి చెయ్యగలిగితే కన్యాదాన ఫలం దక్కుతుందన్న ఆశకలిగింది. ఆశ అంటే ఉందిగాని తీరే మార్గం ఉండద్దూ? ఆర్జించే మనిషి పోయాడు. వసంత గురించి సేవింగ్స్ ఆకౌంటులో దాచిన సొమ్ము పెళ్ళికి సరిపోతుందో, లేదో....లేకుంటే ఇల్లు అమ్మడం తప్పితే మరోదారిలేదు. కానీ, ఇల్లు అమ్మకానికి పెడితే తన జీవితానికి దారిలేదు.

సరిగ్గా ఆ సమయంలోనే అదృష్టంలా కలిసివచ్చిందది. చక్రధరం పెళ్ళయ్యాక, బాధ్యతలు కాస్త తీరేయన్న తరవాత ఆయన కొన్న సాంఘిక భద్రతా సర్టిఫికేట్ తాలూకు సొమ్ము మూడింతలై ఆరువేల వరకూ అందింది. నిజానికి ఆ సొమ్ము అందడానికి మరో ఏడేళ్ళ వ్యవధి ఉన్నా ఆయన మరణానంతరం పూర్తి సొమ్ము వారసురాలైన తనకు వచ్చింది.

కుటుంబ వ్యవహారాల్లో ఆయన ఎంత ముందు చూపుతో వ్యవహరించే వారని! సంపాదనకు తగ్గఖర్చు ఎప్పటికప్పుడు ఉంటూనేఉంటుంది. కానీ, ఉన్నంతలో పొదుపు చేసే ముందు చూపు ఎందరి కుంటుంది?

వసంత పెళ్ళికూడా అట్టే శ్రమ పడికుండానే జరిగిపోయింది. తను పెళ్ళి సంబంధాలు వెదికే ప్రయత్నంలో ఉందని తెలియగానే వసంత తన అభిప్రాయాన్ని నిర్భయంగా చెప్పేసిందా రాత్రి. నిజంగా ఆశ్చర్యమనిపించింది. అమాయకంగా లోకమంటే ఏమిటో తెలియకుండా పెరిగిన వసంత ఉరిందాలా తనొక అబ్బాయిని ప్రేమించాననీ, అతనిని తప్ప మరొకర్ని పెళ్ళిచేసుకోననీ చెపుతూంటే ఆశ్చర్యంకాక ఏమిటి?

ప్రేమ వివాహమే అయినా కట్నం మాత్రం తప్పలేదు. చక్రధరం కూడా ఆర్థికంగా కొంత సాయపడ్డాడు. వసంత అత్తవారింటికి వెళ్ళిపోవడంతో తన బాధ్యతలూ గట్టెక్కిపోయాయి.

అన్నం ఉడికేక. మిగిలిన పంటపనిని పూర్తిచేసి మళ్ళీ వీధి గుమ్మంలోకొచ్చి కూర్చుంది శారదమ్మ ఉదయం నించీ ఉన్న మబ్బులు తొలగిపోయి కాస్త ఎండ పొడ వచ్చింది.

'ఇంకేముంది? పడమటి ఆకాశం మీద మిగిలిన పల్చటి ఎండలాంటిది తన బ్రతుకు, ముగిసిపోవడానికి ఎంతోకాలం అవసరం లేదు' అనుకుంది శారదమ్మ.

ఆ ఆలోచనతోనే ఉన్న ఇల్లు అద్దెకిచ్చి. ఊరవతల చవగ్గా ఎప్పుడోకొని ఉంచేసిన స్థలంలో ఓ పాకవేయించి అందులోకి వచ్చేసింది. తల దాచుకుందుకి తన కడిచాలు ముందుజాగాలో పూలమొక్కలూ, కూరగాయ పాదులూ నాటింది. మొక్కల సంరక్షణ, దైవ ప్రార్థన, వంట, సాయంకాలాలు గీత చదివి తనకున్న పరిజ్ఞానంతో నలుగురికీ చెప్పడం. ఇదీ దైనందిన కార్యక్రమం. పిల్లల్ని గూర్చి- వాళ్ళ జీవితాలనుగూర్చి

బెంగలేదు. డబ్బుకోసం తాపత్రయంలేదు. జీవిత చరమాంకం ఇలా గడిచిపోవడంకన్నా ఇంకేం కావాలి?

తన నోటీ మంచితనంవల్లా, తను అందించే గీతార్థ మకరందం వల్లా తన నభిమానించే వారు జతపడ్డారు. ఏకాకిగాఉన్నా, ఎక్కడ ఏ పూరింట ఉన్నా తను తన గౌరవాన్ని కాపాడుకుంటూనే ఉంది.

కొత్తగా పెళ్ళయిన వసంతకు తను పండగ ముచ్చటను తీర్చ లేదు. ఈ చివరిపాకలోకి ఎవరొస్తారు? అందుకే మూడు నెలల క్రిందను మనియార్డర్ చేసింది పండగ కానుకగా ఖర్చు పెట్టుకోమని ప పిహారమై పోయింది. వసంత దగ్గర్నుంచి కూడా ఉత్తరం లేదు.

బహుశః తను చేసిన పనికి అందరికీ తనపై కోపమొచ్చి ఉం టుంది. శారదమ్మ కళ్ళ నుండి నీళ్ళు జలజలా రాలిపడ్డాయి.

సరిగ్గా ఆ సమయంలోనే వీధి గుమ్మంలో మూడు రిక్షాలొచ్చి ఆగేయి. పెద్దల్లుడూ, మాలతీ, చక్రధరం, సుందరీ, వసంత, చిన్నల్లుడు. తన కళ్ళను తానే నమ్మలేనట్లు చూసింది.

"అంతలా ఆశ్చర్యపోకమ్మా మేమే! డబ్బు రావలసిన వేళకి రాక పోవడంతో ఒక్కమారే వచ్చాం". అంటున్నాడు చక్రధరం. మాలతి పిల్లలు తన చుట్టూ మూగేసేరు. సుందరి కొడుకు చేతులు చాస్తున్నాడు తన నెత్తుకోమని.

"ఒక్క ఉత్తరం ముక్కయినా రాయకుండా మీరంతా ఇలా వచ్చేస్తే నా గుండె ఆగిపోదట్రా ఆనందంతోటీ!"

శారదమ్మ మాటలకి చక్రధరం నవ్వేసేడు.

"అవును మరి. నువ్వీ ఊరి చివరి పర్ణశాలలో హాయిగా ఉంటూ మమ్మల్ని మరిచిపోతూంటే రావేమిటి?" అన్నాడు.

"అవునమ్మా ఇక్కడ ఉండలేమనేగా డబ్బు పంపిందీ? నువ్వెక్క

డుంటే అక్కడే మాకు బాగుంటుంది. అన్నయ్యా, మేము ఎప్పుడో అనుకున్నాం ఇలా ఈ పండక్కి వద్దామని" అంటోంది వసంత.

గుండెలోని గుబులంతా సంతోషంగా మారి, ఉప్పొంగి కళ్ళలోంచి ధారగా కారింది శారదమ్మకు. ఆమె కళ్ళకు తన ముగ్గురి పిల్లలు పిల్లల్లా, కాకుండా తన జీవితానికి వెలుగునిచ్చే ఆశల దివ్వెల్లా కనిపించారు. ఆ దివ్వెలకు చమురుపోసి వెలిగించిన ఆ ఇంటి యజమాని రూపుకూడా ఆమె మనో ఫలకంమీద స్పష్టంగా ముద్రితమైం దాక్షణాన.

(ఆంధ్రప్రభ 16-10-1985)